వెంటాడుతున్న వాన'గండం'


ధాన్యాన్ని కుప్ప పోస్తున్న రైతు


ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

- ఆందోళనలో రైతులు
- వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు
- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

రేగొండ: మండలంలో నాలుగు రోజులుగా వింత పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కొట్టడం తర్వాత ఉరుములతో, మెరుపులతో ఆకాశం మేఘావృతమై వర్షం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చినప్పటికీ అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. వరుణుడి ఉరుములతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం, పంట పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటల పరిస్థితి ఎలా అని రైతులను ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఉదయం వేళలో వాతావరణం ఎండగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని పరదాలలో ఆరబోస్తున్నారు. సాయంత్రం కాగానే ఉరుములు మెరుపులకు మళ్లీ ధాన్యాన్ని కుప్ప చేస్తున్నారు. అంతే కాకుండా రైతులకు అదనంగా టార్పాలిన్లు భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్లు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన


సెంటర్లలో నిరసన తెలుపుతున్న రైతులు

మల్హర్: కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ సక్రమంగా జరగడం లేదంటూ మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ సెంటర్‌లో రైతులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెంటర్‌లో కాంటాల నిర్వహణ సరిగా లేదని, కాంటాలు నిర్వహించిన మిల్లర్లకు తరలించడంలో సెంటర్ నిర్వాహకులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. సెంటర్‌లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఓ వైపు వర్షా సూచనలు ఉన్నాయని ప్రకటనలు వస్తుడంటంతో ప్రతీ రోజు భయం భయంగా ఉందని చెబుతున్నారు. దీంతో చేసేది ఏమి లేక ప్రభుత్వ ఇచ్చిన గిట్టుబాటు ధరకంటే తక్కుగా దళారులుకు అమ్ముకోవడానికి సిద్ధవుతున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొగుగోళ్లు వేగవంతం అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ ఆరోపణలు అర్థరహితం


మాట్లాడుతున్న పంతకాని సమ్మయ్య

కాటారం: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ప్రొటోకాల్ విషయంలో పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితం అని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ దళిత నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వేరు వేరుగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా టెండర్ తీసుకున్న సంస్థలు ఫ్లెక్సీల్లో ఫొటోలు ఏర్పాటు చేయకపోతే మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. భారత రాజ్యాంగం వర్థిల్లాలని మాట్లాడే పుట్ట మధు బీఆర్ఎస్ పాలనలో అప్పటి దళిత జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ప్రొటోకాల్ విషయంలో ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి అశోక్, అత్మకూరి కుమార్‌యాదవ్, బీరెల్లి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


కమలాపురంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


ములుగు రూరల్: నగర సంకీర్తన చేస్తున్న హనుమాన్ మాలధారులు

మంగపేట: మండలంలోని కమలాపురంలో ఆంజనేయస్వామి దీక్ష చేపట్టిన హనుమాన్ భక్తులు రామాలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80 మంది హనుమాన్ భక్తులు రామాలయం నుంచి సీతారాముడు, సీతాదేవి లక్ష్మణుడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిమలతో గ్రామంలోని వీధుల్లో భజన కీర్తనలతో ఊరేగింపుగా శోభాయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు లింగంపల్లి శ్రీనివాసరావు, గురుస్వామి మోహన్, నూకల రాజేష్, పలువురు గురుస్వాములు, కన్నె స్వాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లిలో హనుమాన్ మాలధారణ స్వాములు సోమవారం నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ స్వాములు భజనలు, జై శ్రీరాం, జై హనుమాన్ నామ స్మరణతో కాలనీలు మార్మోగాయి. గ్రామస్తులు స్వామి రథయాత్రకు నీళ్లు ఆరగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

చిట్యాల: నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు విత్తన లైసెన్స్ డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. విత్తన కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లును తీసుకోవాలని అన్నారు. బిల్లును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపరుచుకోవాలని తెలిపారు. గ్రామాలలో కొంత మంది తిరుగుతూ విత్తనాలు విక్రయిస్తూ బిల్లులు ఇవ్వని వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. బీటి-3 పత్తి విత్తనాలు అమ్మితే వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని రైతులను కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

మొగుళ్లపల్లి/రేగొండ: వానాకాలం సీజన్లో రైతులకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను యాభై శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు సుందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి సోమవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు రాయితీపై మండలంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 30 కిలోల బస్తాకు రూ.2137.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు తొలకరిలో దుక్కిదున్ని చల్లుకోని 40 రోజుల తరువాత పూత దశలో భూమిలో కలియదున్నాలని తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

విరాళం

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన రాచమల్ల అర్జున్‌రెడ్డి, కృష్ణారెడ్డి సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కామిడి రత్నాకర్‌రెడ్డికి రూ.లక్ష విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు మోతుకూరి నరేష్, బిళ్ల సత్యనారాయణరెడ్డి, మందల రాఘవారెడ్డి, కాల్వ సమ్మిరెడ్డి, బొమ్మ శంకర్, సారంగం, చెక్క నర్సయ్య, సర్వ శరత్, అర్చకులు రఘునందన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో నేడు (మంగళవారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత తాడిచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు శిక్షణ తరగతులు

మల్హర్: మండలంలోని ప్రాథమిక, ఉన్నత, ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులుకు నేడు (మంగళవారం) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వల్లెకుంట జిల్లాపరిషత్ పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కాటారం: మండలంలోని దేవరాంపల్లిలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని వెళ్లాడు. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాంపల్లికి చెందిన కామిడి లక్ష్మి ఇంట్లో నిద్రిస్తుంది. దుండగుడు ప్లాన్ ప్రకారం ఇంట్లోకి వెళ్లే విద్యుత్ సరఫరాను తెల్లవారుజామున నిలిపివేశాడు. వృద్ధురాలు ఇంటి బయటకు రావడంతో దుండగుడు మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లాడు. బాధితురాలు కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చే సరికి పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

కమిటీ ఎన్నిక


శ్రీనివాస్, అధ్యక్షుడు


రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్

చిట్యాల: మండలంలోని దూత్‌పల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని సోమవారం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చెప్యాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్కాకుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అంకేశ్వరపు రాజు, ఉపాధ్యక్షుడిగా వనం భాస్కర్, కోశాధికారిగా ఈరగాని రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు.

రేగొండలో గ్రామ కమిటీ..



రేగొండ: మండలంలోని లింగాలలో నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు బండారి దేవేందర్, మైన భిక్షపతి తెలిపారు. అధ్యక్షుడిగా ఆకుల రఘు, ప్రధానకార్యదర్శిగా దొంగల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా ఆకుల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా దొంగల శ్రీను, కోశాధికారిగా మేకల సురేష్, యూత్ అధ్యక్షుడిగా మద్దెల రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొసరి శ్రీనివాస్, జున్న సురేష్, కొసరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల వద్ద రద్దీ





భూపాలపల్లి అర్బన్: సర్వసతీ పుష్కరాల్లో భక్తులు ఎండ వేడిమిని తట్టుకొలేకపోతున్నారు. సోమవారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో భక్తులు దాహార్తితో అల్లాడారు. దీంతో పుష్కరఘాట్లు, పార్కింగ్ పాయింట్లు, ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ఏర్పాటు చేసి చలివేంద్రాలకు భక్తులు బారులుదీరారు.

మాతా శిశు, షీ రూమ్‌ల ఏర్పాటు



కాటారం: కాళేశ్వరంలోని తాత్కాలిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మాతా శిశు, షీ రూంలను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సోమవారం ప్రారంభించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే మహిళల సౌకర్యార్థం మాతా శిశు కేంద్రం, షీ గదిని ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. షీ రూంను, బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని మహిళలు, పాలిచ్చే తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఇందు, ఆషా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చిట్యాల: సరస్వతి నది పుష్కర స్నానానికి వచ్చిన భక్తులకు ఘాట్ వద్ద, గోదావరి నది ఒడ్డుపై ఎలాంటి టెంట్లు గానీ, చలువ పందిళ్లు గానీ అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు ఎండవేడిని తట్టుకోలేక పుష్కరఘాట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న భవనం కింద తల దాచుకుంటున్నారు. కాగా నూతనంగా నిర్మిస్తున్న భవనం సెంట్రింగ్ కర్రలు, ప్లేట్స్ కూలి భక్తులపై పడితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గోదావరి ఒడ్డుపై టెంట్లను ఏర్పాటు చేయడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి ఎవరు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయలి.

మరుగుదొడ్ల నిర్వహణ కరువు..



చిట్యాల: సరస్వతి నది పుష్కరాలకు వస్తున్న భక్తుల కోసం పుష్కరఘాట్ సమీపంలోని పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు నిర్వహణ కరువై కంపు కొడుతున్నాయి. మరుగుదొడ్లకు ఏర్పాటు చేసిన డోర్లు సైతం ఎక్కడికక్కడే ఊడిపోయాయి. దీంతో భక్తులు మరుగుదొడ్లకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా నిర్వాహకులను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చల్ల చల్లగా..



భూపాలపల్లి అర్బన్: సరస్వతీ పుష్కరాలకు హాజరైన భక్తులు ఎండ వేడిమి తట్టుకొలేక ఐస్‌క్రీమ్ తింటున్నారు. పుష్కర స్నానం చేసిన అనంతరం చాలా మంది కుటుంబ సభ్యులందరూ పిల్లలతో కలిసి వీఐపీ ఘాట్ వద్ద చెట్టుకింద చల్లగ కుర్చొని ఐస్‌క్రీమ్‌లు తిని చల్లబడుతున్నారు.

వృద్ధుడికి అస్వస్థత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని సరస్వతినది పుష్కరాలకు వచ్చిన ఆంధ్రప్రదేశ్‌లోని పీఠాపురానికి చెందిన వీర్రాజు అనే వృద్ధుడు అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం ఎండ వేడికి తట్టుకోలేక కింద పడిపోయాడు. వెంటనే వైద్యసిబ్బంది అంబులెన్స్‌లో భూపాలపల్లిని ఆస్పత్రికి తరలించారు.

పుష్కరాల్లో తెలంగాణ యూత్ ఫోరం అధ్యక్షుడు..



కాళేశ్వరం: కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాలలో తెలంగాణ యూత్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ముదుగంటి విష్ణువర్థన్‌రెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు అచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట బాల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాస్ చంద్రబోస్, చింతల సంపత్‌రెడ్డి, రాజవర్థన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

సుందరయ్య ఆశయసాధనకు పోరాడాలి


ములుగు రూరల్: సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం పస్రాలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ సమాజ నిర్మాణం కోసం సుందరయ్య చూపిన మార్గంలో ప్రతీ కార్యకర్త నడవాలని అన్నారు. రైతాంగ పోరాటంలో పాల్గొని నిరుపేదలకు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు కడారి నాగరాజు, గొంది రాజేష్, అంబాల మురళి, సూర్యనారాయణ, రాజు, కవిత, సువర్ణ, సులోచన పాల్గొన్నారు.

ములుగు రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, పీడిత ప్రజల కోసం పోరాడిన ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు అర్థవంతంగా వివరించి ప్రజా సమస్యలపై పోరాడాడని అన్నారు. ఎండీ గఫూర్‌పాషా, పొదిళ్ల చిట్టిబాబు, మల్లారెడ్డి, రవిగౌడ్, రాజు, రత్నం ప్రవీణ్ పాల్గొన్నారు.


గోవిందరావుపేట: మాట్లాడుతున్న చిట్టిబాబు


వాజేడులో..

వాజేడు: పుచ్చలపల్లి సుందరయ్య పోరాట యోధుడని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అన్నారు. మండల కేంద్రంలో పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడు అన్నారు. సదా క్రేన్, బచ్చలి కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, చంద్ర శేఖర్, నరేష్, కుర్సం నాగలక్ష్మి, పూనెం కృష్ణ బాబు, యశోద, ఉదయ, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

నీటి నిల్వకు చర్యలు

- వాగులు, కుంటల్లో నీరు వృథాగా పోకుండా చర్యలు
- భూగర్భ జాలాల పెంపు
- అడవి జంతువులకు తీరనున్న దాహార్తి


నీటి కుంటల వద్ద పనులు చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఏటూరునాగారం: వేసవిలో వన్యప్రాణులకు దాహార్తి తీర్చడానికి అటవీశాఖ సరికొత్తగా కుంటలు, చెరువులు, వాగుల్లో నీటి నిల్వల ప్రక్రియను కొనసాగిస్తోంది. ఏజెన్సీలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి ప్రాంతాల్లో జాతీయ రహదారికి అనుకొని ఉన్న వాగులను ఎంపిక చేసుకొని వాటిలో ఉన్న నీరు బయటకు వృథాగా పోకుండా చెట్ల కొమ్మలు, ఇసుకతో కప్పిపెట్టి నిల్వ చేస్తున్నారు. వన్యప్రాణుకు నీటి వసతి 365 రోజులపాటు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రాబోయే వర్షాకాలంలో నీరు దట్టమైన అటవీప్రాంతంలో వాగులకు ప్రవహించే ప్రాంతాలను గుర్తించి చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తున్నారు. వర్షపు నీరు వాగుల్లో వృథాగా పోకుండా ఈ చెక్‌డ్యామ్‌లు అడ్డుకొని నీటిని నిల్వ చేస్తాయి. దీంతో భూగర్భ జలాల పెరుగుదలతోపాటు అడవి జంతువులకు నీటి వసతి కల్పిస్తున్నారు.

ప్రత్యేక మంచెలు

నీటి సెలయేరులను వీక్షించేందుకు పర్యాటకులు, అటవీశాఖ సిబ్బంది వాగుల వద్ద వెదురుకర్రలతో మంచెలను ఏర్పాటు చేశారు. దానిపై ఎక్కి కూర్చొని అటవీజంతువుల రాకపోకలతోపాటు, నీటి వసతులు, పర్యాటక అందాలను ఆస్వాదించేలా ఏర్పాటు చేశారు.


తాడ్వాయి-ఏటూరునాగారం అడవి మధ్యలో ఏర్పాటు మంచె

మత్తడి నీరు నిల్వ



వాగులు, చెరువులు, కుంటల్లో ఉన్న నీరు బయటకు వృథాగా పోకుండా ఇసుక, చెట్ల ఆకులతో కప్పివేసి అడ్డుకట్టలు వేయడం వల్ల నీరు బయటకు వెళ్లకుండా ఉంటుంది. గిరిజన యువకులకు ఉపాధి కల్పించడంతోపాటు అటవీ జంతువులకు నీటి వసతి కల్పించడం జరుగుతుంది. రెండు విధాలుగా లాభం ఉంటుందని ఈ ప్రక్రియను ప్రారంభించాం.

– అబ్దుల్ రెహమాన్, అటవీశాఖ సౌత్ రెంజ్ అధికారి, ఏటూరునాగారం

గుడుంబా స్థావరాలపై దాడులు


పట్టుకున్న పానకం, గుడుంబాతో పోలీసులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంటలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై జక్కుల సతీశ్ తెలిపారు. వెయ్యి లీటర్ల పానకాన్ని పారబోసి, ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గుడుంబా విక్రయిస్తున్న రాధ అనే మహిళపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో ట్రెయినీ ఎస్సై జగదీశ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.